# స్వయం సహాయక సంఘాలకు చేయూత

## మేయర్ గుండా ప్రకాశ్‌రావు

**వరంగల్ సిటీ, డిసెంబరు 27 :** మెప్మా పరిధిలోని స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు చేయూతనిస్తామని నగర మేయర్ గుండా ప్రకాశ్‌రావు అన్నారు. జీడబ్ల్యూఎంసీ, మెప్మా ఆధ్వర్యంలో జీవనోపాధి మార్గాలపై శుక్రవారం వరంగల్‌లోని జీడబ్ల్యూ ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో శిక్షణ కార్యక్రమం జరిగింది. సీవోలు, టీఎల్ఎఫ్, ఆర్పీలు, హెల్త్ సీఆర్పీలకు వివిధ స్వయం ఉపాధి అవకాశాలు, వస్తువుల తయారీ, మార్కెటింగ్ అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా మేయర్ గుండా ప్రకాశ్‌రావు మాట్లాడారు. మెప్మా ద్వారా అందిస్తున్న స్వయం ఉపాధి అవకాశాలను మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళలకు పట్టుదల ఎక్కువగా ఉంటుందన్నారు. ఇదే వారిని విజయతీరాలకు చేరుస్తుందన్నారు. కాగా మహిళా సంఘాలు తయారు చేసిన శానిటేషన్ ప్యాడ్, ఇతర వస్తువులను జీడబ్ల్యూఎంసీ కమిషనర్ పమేలాసత్పతి పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆధునిక యుగంలో మార్కెట్‌లో పోటీతత్వం ప్రధానమైందన్నారు. వస్తువుల తయారీలో నాణ్యత, అందుబాటు ధరలతో ప్రజల ఆదరణ పొందవచ్చని తెలిపారు. వస్తువులను ప్రజలు అన్ని విధాలుగా మెచ్చి కొనుగోలు చేసేలా తయారు చేయాలన్నారు. స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన వస్తువులను చూస్తే భవిష్యత్తులో కార్పొరేట్ కంపెనీలతో పోటీ పడగలరనే విశ్వాసం ఏర్పడిందని అభినందించారు. వస్తువుల తయారీ, ముద్రణ విషయాలలో కమిషనర్ పమేలాసత్పతి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సీహెచ్ నాగేశ్వర్, ఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, కార్యదర్శి విజయలక్ష్మి అహ్మదాబాద్‌కు చెందిన శిక్షకులు, తదితరులు పాల్గొన్నారు.



అవగహన సదస్సులో మాట్లాడుతున్న మేయర్ గుండా ప్రకాశ్‌రావు